క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలి మృతి




ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన భూపతి కమలమ్మ (72) శనివారం సాయంత్రం ఇంట్లో ఉన్న బీరువాలోని బట్టలు తీస్తున్న క్రమంలో బీరువా కింద ఉన్న నాగుపాము కాలుపై కాటేసింది. దీంతో కమలమ్మ ఒక్కసారిగా కేకలు వేయగా పక్క గదిలో ఉన్న తన కుమారుడు వెళ్లి చూశాడు. పాము కాటు వేసినట్లు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కమలమ్మ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై సాయిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండగట్టుకు పాదయాత్ర



వేలేరు : మండలానికి చెందిన కొంతమంది హనుమాన్ మాలధారులు ఆదివారం కొండగట్టుకు పాదయాత్రగా తరలివెళ్లారు. నాలుగైదు రోజులు పాదయాత్ర చేసి హనుమాన్ జయంతి నాటికి కొండగట్టుకు చేరుకొనున్నట్లు వారు తెలిపారు.

ధర్మసాగర్‌లో..



ధర్మసాగర్ : హనుమాన్ మాలధారణ స్వీకరించిన భక్తులు మాల విరమణకు ఆదివారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. మండలంలోని నారాయణగిరి గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి సుమారు 14 మంది మాలధారులు పాదయాత్ర వెళ్లారు. ఈనెల 22వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా మాలధారణ విరమణ చేయనున్నట్లు వారు తెలిపారు. కాగా గురు స్వాములు మడికంటి సాయిబాబు, పుట్ట చంద్రులు స్వాములకు ఇరుముడి కట్టి భక్తులను సాగనంపారు. స్వాములు డబ్బేట సాంబరాజు, ఏశబోయిన మహేశ్, మాచర్ల పవన్, సతీశ్, చందు, రాంచరణ్, సాంబరాజు, శ్రీనాథ్, తదితరులు పాదయాత్రగా వెళ్లారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ధర్మసాగర్ : మండలంలోని పీఏసీఎస్ సొసైటీల్లో జీలుగ విత్తనాలు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని ఏఓ పాలకుర్తి రాజేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించడం జరిగిందని, 30 కేజీల బ్యాగుకు రైతువాటా కింద రూ.2,137 చెల్లించవలసి ఉంటుందన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు ఏఈఓను పట్టాబుక్కు, ఆధార్ కార్డుతో సంప్రదించాలని కోరారు. పీఏసీఎస్ సెంటర్‌లో 830 బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు సకాలంలో తీసుకోగలరని కోరారు.

కళాబృందం ప్రదర్శన



నడికూడ : మండలంలోని వరికోల్‌లో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, 100పై నృత్య ప్రదర్శనల ద్వారా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో పయనించాలని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకర్ ఢీ.. వృద్ధుడి దుర్మరణం

మామునూరు: సెప్టిక్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన ఆదివారం సాయంత్రం ఖిలా వరంగల్ మండలం అల్లీపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం అల్లీపురం గ్రామానికి కొత్తపెల్లి యాకయ్య (85) వ్యక్తిగత పనులపై రోడ్డుపైకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సెప్టిక్ ట్యాంకర్ వెనుకకు తీస్తున్న సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యాకయ్యను బలంగా ఢీకొట్టింది. దాంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు చక్రపాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సై..

- వేసవి దుక్కులపై రైతుల దృష్టి
- 25న రోహిణి కార్తె ప్రారంభం
- ఎరువుల తరలింపు, ఇతర పనుల్లో బిజీ
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

ఎల్కతుర్తి : వర్షాకాలం సమీపిస్తుండడంతో రైతులు వేసవి దుక్కులపై దృష్టి సారిస్తున్నారు. ఈ ఏడాది యాసంగిలో పంట చేతికందే సమయంలో అకాల వర్షాలతో అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ఆశించిన స్థాయిలో రైతులకు దిగుబడి రాకపోవడంతో ఖరీఫ్ సీజన్‌పై పట్టు సాధించేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఈనెల 25న రోహిణి కార్తె ప్రారంభం కానుండడంతో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని రైతులు పత్తి, వరి, ఇంతర పంటలు సాగు చేసేందుకు ముందస్తుగా వేసవి దుక్కులకు సిద్ధమవుతున్నారు. ఈ రెండు మండలాల్లోని రైతులు ఇప్పటికే పంట పొలాల్లో పశువుల ఎరువులను చల్లుతున్నారు. వేసవి దుక్కులు దున్నడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తుండడంతో రైతులు ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు ప్రాణాళిక రూపొందించి ముందడుగు వేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం.



వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నాం. పంటలో కలుపు మొక్కలు నివారించవచ్చు. తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి.

- రాజ్‌కుమార్, ఏఓ ఎల్కతుర్తి

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల ఎరువు, కంపోస్టు ఎరువులను భూమిలో చల్లుకోవాలని, దీంతో నేల సారవంతంగా తయారై కలుపు మొక్కలు నశిస్తాయని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పురుగు, వివిధ రకాల తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చని అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చెక్క నాగలితో దున్నడం వలన కనీసం 30 సెంటిమీటర్ల లోతు నుంచి దుక్కి వస్తుంది.
- భూమిని అడ్డంగా దున్నాలి. పొడవు దున్నితే వర్షాలు పడినప్పుడు వరదకు మట్టి కొట్టుకు పోతుంది. ఫలితంగా దిగుబడి తగ్గుతుంది.
- రోటవేటర్‌తో తక్కువ సమయంలో దుక్కులు దున్నవచ్చు. ఫ్లవ్‌తో దున్నితే దుక్కి లోతుగా వస్తుంది.
- నాగలితో దున్నితే భూమి చదునుగా ఉంటుంది.
- వర్షం పడగానే పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు మడుల్లో చల్లుకోవాలి.
- విత్తనం విత్తేవరకు రైతులు సమాన పద్ధతిలో ఉంచుకోవాలి.
- రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి.
- నీటిని అవసరం మేరకు వాడాలి.

క్రీడల్లో రాణించాలంటే సాధనే ముఖ్యం

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



విజేతలకు షీల్డ్, నగదు పురస్కారాన్ని అందజేస్తున్న రవీందర్‌రావు

ఐనవోలు : క్రీడల్లో రాణించాలంటే సాధనే కీలకమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఐనవోలు క్రికెట్ ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. పట్టుదల ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రతి రంగంలో గెలుపోటములు సహజమని వాటిని పట్టించుకోకుండా నిరంతరం సాధన చేసి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. క్రికెట్ పోటీల్లో 30 టీంలు పాల్గొనగా ప్రథమ బహుమతి ఐనవోలు రైసింగ్ స్టార్స్, ద్వితీయ బహుమతి ఐనవోలు యువసేన, తృతీయ బహుమతిగా ఖిలా వరంగల్ టీం నిలవగా ఆయన నగదు, షీల్డ్‌లను అందించారు. మాజీ సర్పంచ్ కుమారస్వామి, మండల నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, కొత్తూరు సునీల్, రాజిరెడ్డి, నాయకులు పరమేశ్, కుమార్, భానుప్రసాద్, పులి శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలి



ఎల్కతుర్తి : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



శాయంపేటలో..

ఎల్కతుర్తి : ఈనెల 26,27వ తేదీల్లో హనుకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించే (సీపీఐ) భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సీపీఐ జిల్లా రెండో మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు గడిచిన సందర్భంగా కమ్యూనిస్టు పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేసి భవిష్యత్ రాజకీయాలపై చర్చ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆదరి రమేశ్, మంచాల రమాదేవి, కుమారస్వామి, సంజీవరెడ్డి, కుమారస్వామి, బాలరాజు, కిషన్, మమత, భాస్కర్‌తో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : ఈనెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగే సీపీఐ జిల్లా 2వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆదివారం మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బత్తిని సదానందం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈనెల 26,27 తేదీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 2వ మహా సభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు అంకూషావలీ, రాజేందర్, లక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

గొల్ల, కురుమలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగయ్య



మాట్లాడుతున్న కాడబోయిన లింగయ్య

కమలాపూర్ : ఎన్నికలకు ముందు గొల్ల, కురుమలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన ఆ సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొల్ల, కురుమలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసగించినట్లే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మోసగిస్తోందని ఆరోపించారు. రెండో విడత గొర్రెల పంపిణీకి బదులు రూ.2 లక్షలు నగదు బదిలీ చేయాలని, గొర్రెల కాపర్ల సంఘాలకు పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని, గొర్రెలు, మేకలకు బీమా చేయించాలని డిమాండ్ చేశారు. అవినీతి సాకుతో గొర్రెలు ఇవ్వకుండా డీడీలు వాపస్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమా ఉందన్న కారణం చూపి ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెల కాపర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, నాయకులు సమ్మయ్య, గొర్రెలు, మేకల పెంపకందారులు పాల్గొన్నారు.

మండల నూతన కార్యవర్గం

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాల్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా బేతి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లబోయిన రవీందర్, సహాయ కార్యదర్శులుగా కాల్వ సమ్మయ్య, అట్ల చంద్రమౌళి, కొడారి రాకేశ్, కాల్వ కుమారస్వామి, ఎల్లబోయిన రవీందర్, ఎల్లబోయిన శ్రీనివాస్, కొడారి అరుణ్, సంపత్, చంద్రయ్య, రమేశ్, పోశాలు, భిక్షపతి, కోటి, రాజయ్య, రాజేష్, అనిల్, రంగయ్య, కొమురయ్య, సారయ్య, రాజయ్య ఎన్నికయ్యారు.

గుల్‌మొహర్ కనువిందు



మండల కేంద్రం నుంచి శాలపల్లికి వెళ్లే రోడ్డుకిరువైపులా ఎర్రటి పూలతో ఉన్న గుల్‌మొహర్ చెట్లు ప్రయాణీకులను ఆకర్షిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారడంతో ప్రయాణీకులకు నీడతో పాటు ఎర్రటి పూలు పూసి కనువిందు చేస్తున్నాయి.

- వేలేరు

కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహాలకు పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారులు

కమలాపూర్ : మండలంలోని గూడూరులో శ్రీ అభయాంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజ స్తంభ స్థిర యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. ఆదివారం ఉదయం వేద పారాయణం, గణపతి పూజ, మండపారాధన, నవగ్రహ క్షేత్రపాలక, యోగిని వాస్తుమన్యు సూక్త మూల మంత్ర హోమం, విగ్రహాల ధాన్యాధివాసం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం వేద పారాయణం, మండపారాధన, జలాధివాస, ధాన్యాధివాస హోమాలు, విగ్రహాలవన, ఫల, పుష్ప సహిత శయ్యాధివాసం, రాజోపచారాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు మఠం విజయ్‌కుమార్ స్వామి, గిరిమఠం సంపత్‌కుమార్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధమవుతూ.. కానరాని లోకాలకు

- వరి మొదళ్లకు నిప్పు పెడుతూ ఊపిరాడక పొలంలో రైతు మృతి
- నర్సక్కపల్లిలో విషాదఛాయలు



ఊపిరాడక గడ్డి కట్టల వద్ద మృతిచెందిన శంకర్‌రావు

నడికూడ : కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన అన్నదాత పొలంలోనే ప్రాణాలు విడిచాడు. వరి మొదళ్లకు నిప్పు పెడుతుండగా గడ్డి కట్టలకు మంటలు వ్యాపించి ఊపిరాడక కుప్పకూలిపోయాడు. సమీపంలో ఎవరూ గమనించకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ హృదయ విదారక ఘటన మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అముదాపురం శంకర్‌రావు (65)కు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈక్రమంలో ఆదివారం తన పొలంలోని వరి మొదళ్లకు నిప్పు పెడుతున్నాడు. దీంతో పక్కన నిల్వ ఉన్న గడ్డి కట్టలకు మంటలు అంటుకున్నాయి. మంటలు ఆర్పే క్రమంలో వేడికి గురైన శంకర్‌రావు.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.



శంకర్‌రావు (ఫైల్)

సమీపంలో ఉన్నవారు ఇచ్చిన సమాచారంతో వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. శంకర్‌రావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయమై పరకాల పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తిరంగా యాత్రను విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి



మాట్లాడుతున్న కొలను సంతోష్‌రెడ్డి

హన్మకొండ: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని భారత సాయుధ దళాలకు కృతజ్ఞత తెలుపుతూ ఈనెల 19న చేపట్టనున్న తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, నగరంలోని డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ యాత్ర పూర్తిగా రాజకీయేతమైనదని స్పష్టం చేశారు. ఎలాంటి పార్టీ చిహ్నాలు, నాయకుల ఫొటోలు, బ్యానర్లు, బ్రాండింగ్ లేకుండా కేవలం జాతీయ పతాకంతోనే యాత్ర నిర్వహించాలని సూచించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల పట్ల గౌరవాన్ని వ్యక్తపరుస్తూ ఈ కార్యక్రమం కొనసాగాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సోమవారం సాయంత్రం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జరగనున్న తిరంగా యాత్రలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గ కాలనీ, భవాని నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కల్పనకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు కల్పన బల్లోజుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎంప్లాయ్ మోటివేషన్ ఇన్ బ్యాంకింగ్ ఇండస్ట్రీ – ఎ సెలెక్ట్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కల్పనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. వరంగల్ సీకేఎం విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ఎస్.ఉపేంద్రశాస్త్రి పర్యవేక్షణలో కల్పన తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. హనుమకొండకు చెందిన కల్పన ప్రస్తుతం హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలని పాదయాత్ర

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండ – రాంపూర్ మధ్యలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని హనుమాన్ మాలధారులు కోరారు. ఈ మేరకు ఇరు గ్రామాలకు చెందిన మాలధారులు కొండగట్టు అంజన్న ఆలయానికి పాదయాత్రగా ఆదివారం బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ సమస్యతో చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులు స్పందించాలని ఈ సందర్భంగా కోరారు. తరలివెళ్లిన వారిలో దువ్వ నవీన్, రాజేంద్రప్రసాద్, ఆకుల శరత్, కుక్కల రంజిత్, బైరి నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జోలికొస్తే ఊరుకోం..

రామన్నపేట: ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాడుతామని, బీఆర్ఎస్ కార్యకర్తలు, కార్యాలయాల జోలికి వస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ హెచ్చరించారు. 29వ డివిజన్ బీఆర్ఎస్ డివిజన్ యూత్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రాన్ని సాధించిన తాము బెదిరింపులకు భయపడబోమని అన్నారు. డివిజన్‌లో గత ప్రభుత్వ హయాంలో రూ.27 కోట్ల నిధులతో 344 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. 1200 పైగా పెన్షన్లు అందించామని, 500 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. 16 నెలల పాలనలో అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సదాంత్, మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేష్, నాయకులు షఫి, రమేష్, చందు, రాజు, తహసిల్, నాగమణి, లక్ష్మి, రహిం, శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఎల్ఈడీ బల్బుల బహూకరణ



గ్రంథాలయానికి ఎల్ఈడీ బల్బులు బహూకరిస్తున్న మాజీ కౌన్సిలర్ జయంత్‌లాల్

పరకాల : సరైన వెలుతురు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామనే పాఠకుల విన్నపంపై స్పందించిన 21వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆర్పీ జయంత్‌లాల్ ఆదివారం తనవంతు సహాయంగా గ్రంథాలయానికి ఎల్ఈడీ బల్బులు బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకులు పగలు, రాత్రి వేళల్లో ఇబ్బందులు కలుగొద్దనే ఆలోచనతో ఎల్ఈడీ బల్బులతో పాటు ఎలక్ట్రికల్ సామగ్రి అందించినట్లు చెప్పారు. వందలాది మంది యువకులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు పరకాల పట్టణం నుంచి పెద్ద దిక్కుగా మారిన గ్రంథాలయానికి తనవంతు సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు డి.రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాది రవికుమార్, గ్రంథాలయ సిబ్బంది రంజిత్, అరుణమ్మ, రాధమ్మ, పాఠకులు నర్సింగరావు, ఆనంద్, రఘువరణ్, రాజేందర్, అమరేందర్, అనిల్, లెనిన్, సురేశ్, శ్రీను, రమేశ్, రవికుమార్, పవన్, జయశంకర్, మహేశ్, మేఘన, ప్రగతి, సుజాతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



సీఐని నేర వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

కమలాపూర్ : నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి నేర వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. సిబ్బందితో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, నేరస్తులపై మాత్రం కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ హరికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్లు ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ



ధ్వంసం చేసిన మోటార్లు

కమలాపూర్ : గుర్తు తెలియని దుండగులు 10 వ్యవసాయ విద్యుత్ మోటార్లను ధ్వసం చేసి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల శివారులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆయా గ్రామాల రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. యాసంగి పంట సాగు కోసం అంబాల, శ్రీరాములపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఎస్సారెస్పీ కాల్వలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు అమర్చుకుని పంటలు సాగు చేశారు. పంట కోతలు పూర్తయ్యాక రైతులు పంట విక్రయాల్లో నిమగ్నమయ్యారు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని దుండగులు మోటార్లపై కన్నేశారు. రైతులు కుమ్మరి శ్రీకాంత్, సాంబయ్య, గోల్కొండ అనిల్, రమేశ్, శంకరయ్య, ఉడుతనబోయిన కొమురయ్య, మొట్టుపెల్లి రాజేందర్, మంతుర్తి రవి, జేరుపోతుల భిక్షపతి అమర్చుకున్న 10 వ్యవసాయ విద్యుత్ మోటార్లను ధ్వంసం అందులోని సుమారు రూ.21,500 విలువచేసే 43 కిలోల కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. కుమ్మరి శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. కాగా ఘటనా స్థలాన్ని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు.